సాక్షి శ్రీకాకుళం

గురువారం । 21 । ఆగస్టు । 2025



మేలుకోకుంటే నష్టం

ఇటీవల కురిసిన వర్షాలకు పంట భూముల్లో నీరు చేరింది. ఈ సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. - 8లో



వంశధార చెంత..

కడుము గ్రామాన్ని తాగునీటి సమస్య వేధిస్తోంది. పక్కనే వంశధార నది ఉన్నా గుక్కెడు నీరు దొరకని పరిస్థితి ఏర్పడింది. - 8లో

డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం డిగ్రీ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ చివరి వారంలో పరీక్షలు నిర్వహించారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీవీహెచ్, జనరల్, ఆనర్స్ కోర్సులకు చెందిన 5,957 మంది హాజరుకాగా 37.58 శాతం మంది ఉత్తీర్ణత చెందినట్లు పరీక్షల డీన్ డాక్టర్ డి.పద్మారావు తెలిపారు. ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

న్యూస్‌రీల్

గీత కులాలకు రెండు బార్లు

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్ర ప్రభుత్వ నూతన మద్యం పాలసీలో భాగంగా గీత కులాలకు జిల్లాలో రెండు బార్లు కేటాయించనట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు బుధవారం పేర్కొన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో శ్రీశయన కులానికి ఒకటి, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో సొండి కులస్తులకు మరో బార్ కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 29లోగా అందించాలని, దరఖాస్తు రుసుం రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఏడాది కాలానికి రూ.27.50 లక్షలు లైసెన్సు ఫీజు కట్టాలని, లాటరీ పద్ధతిన ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయం వద్ద డ్రా తీస్తామని తెలిపారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్

ఎచ్చెర్ల : ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి మూడో విడత నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎల్.సుధాకర రావు బుధవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 26 లోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పత్రంతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్లతో ఈ నెల 27న నిర్దేశిత ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 29న, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయండి



కొత్త ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి: జిల్లా పరిషత్ యాజమాన్యంలో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందిన వారు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. బుధవారం జెడ్పీ బంగ్లా వద్ద పలువురికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. కొండగొర్రి రాహుల్(భామిని మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్), తీడ తేజేశ్వరరావు(జెడ్పీలో జూనియర్ అసిస్టెంట్), సూరవజ్జల రాజ్యలక్ష్మి(హరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్), వేమూరి నాగమణి(జెడ్పీలో జూనియర్ అసిస్టెంట్)లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎల్.ఎన్.వి.శ్రీధర్, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ తదితరులున్నారు.

24న ఇచ్ఛాపురంలో జానపద సంబరాలు



కరపత్రికను ఆవిష్కరిస్తున్న మహతీ సాంస్కృతిక సంస్థ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా మహతీ సాంస్కృతిక కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24న జానపద సంబరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఈదుపురం రామాలయం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ నెల 24న ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ వద్ద జానపదం, కోలాటం, సంబల్‌పురీ భూం బాగోతం, కోయనృత్యం వంటి ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రంగాల జానకిరామ్, వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనుంజయరెడ్డి, ఉపాధ్యక్షుడు నర్తు గంగయ్య, ప్రచార కార్యదర్శి చలపరాయి వినోద్, కోశాధికారి కొప్పల హేమంత్, కారంగి త్రినాథ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● మద్యం అమ్మకాలు

బార్‌లా తెరిచారు!



- ఇకపై ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు బార్‌లకు అనుమతి
- ఇప్పటికే మద్యం దుకాణాలు, పర్మిట్ రూమ్‌లు
- విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు
- జిల్లాలో పెరగనున్న న్యూసెన్స్
- పోలీసులకు సవాల్‌గా కూటమి మద్యం పాలసీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం మందుబాబులకు బంపర్ ఆఫర్ ఇచ్చింది. తాగినోడికి తాగినంత అన్నట్టు కొత్త బార్‌లతో ముందుకొచ్చింది. జిల్లాలో ఇప్పటికే ఏరులై పారుతున్న మద్యం ప్రవాహం ఇకపై మరింత ఉద్ధృతంగా ప్రవహించనుంది. ఒకవైపు విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయి.. మరోవైపు నాటు సారా.. ఎక్కడికక్కడే అందుబాటులోకి వచ్చిన మద్యం వెరసి రాత్రి పూట గొడవలు, న్యూసెన్స్ పెరిగే అవకాశం ఉండటం పోలీసులకు సవాల్‌గా మారింది.

తాగించడమే పనిగా..

కూటమి ప్రభుత్వం మందుబాబులను పూర్తిగా తాగించడమే పనిగా పెట్టుకుంది. ఎంత ఎక్కువగా మత్తులో ముంచితే అంత ఎక్కువ ఆదాయం వస్తుందని భావిస్తోంది. దానికోసం అన్ని రకాల వెసులుబాట్లు కల్పిస్తోంది. ఇప్పటికే జిల్లాలో 176 మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. లైసెన్సు షాపులతో సరిపోదని బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే వీధికి ఐదు, పది బెల్ట్‌షాపులు నడుస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వానికి మద్యం దాహం తీరడం లేదు. లైసెన్స్ షాపుల వద్దే తాగేందుకు ఏర్పాట్లు చేసింది. పర్మిట్ రూమ్‌లకు అనుమతిచ్చింది. దీంతో లైసెన్సు షాపుల వద్ద మందుబాబుల సందడే సందడి. ఇప్పుడు లైసెన్సు దుకాణాలకు, పర్మిట్ రూమ్‌లకు, బెల్ట్‌షాపులకు అనుబంధంగా బార్‌ల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చింది. జిల్లాలో 19 బార్‌లు ఏర్పాటుకు, వాటికి అనుబంధంగా రెస్టారెంట్‌లకు క్లియరెన్స్ ఇచ్చింది. శ్రీకాకుళం, పలాస, ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాల్టీల్లో అత్యధిక బార్‌లు ఏర్పాటు కాబోతున్నాయి.

అర్ధరాత్రి వరకు మద్యం సరఫరా..

గత వైఎస్ జగన్ ప్రభుత్వం ఏటా మద్యం దుకాణాలతో పాటు బార్‌ల సంఖ్య తగ్గిస్తూ వచ్చింది.



ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కఠినంగా వ్యవహరించింది. బార్‌లు కూడా ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకే మూసివేయాలని ఆదేశించింది. కానీ, కూటమి ప్రభుత్వం ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12గంటల వరకూ బార్‌లు తెరుచుకునేలా ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో విచ్చలవిడితనం మరింత పెరిగిపోనుంది. ఇప్పటికే మద్యం దుకాణాల వద్ద గొడవలు జరుగుతున్నాయి. ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. దాడులు పెరిగాయి. చాలా చోట్ల మద్యం దుకాణాలు న్యూసెన్స్‌గా తయారయ్యాయి. ఇక, బెల్ట్‌షాపుల కారణంగా గ్రామాల్లో చెప్పనక్కర్లేదు. మందుబాబుల జాతరే కనబడుతోంది. పల్లెల ప్రశాంతతకు చిచ్చు పెట్టింది.

విచ్చలవిడిగా నాటుసారా..


ఒకవైపు ప్రభుత్వమే మందుబాబుల వద్దకు మద్యం సరఫరా చేస్తుండగా, ఇంకోవైపు ఒడిశా సరిహద్దు ప్రాంతంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నాటుసారా కూడా తయారవుతోంది. పలాస, నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాల్లో నాటుసారా ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యం కంటే తక్కువ ధరకు దొరకడంతో చాలా మంది ఆకర్షితులవుతున్నారు. వైన్స్‌కు వెచ్చించేంత స్థోమత లేని వారంతా నాటుసారా బారిన పడుతున్నారు.

గుప్పుమంటున్న గంజాయి..



గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఇందుకు నిత్యం దొరుకుతున్న గంజాయి కేసులే నిలువెత్తు సాక్ష్యాలు. విక్రయాలు కూడా కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ప్యాకెట్, లిక్విడ్, చాక్లెట్ రూపంలో విక్రయిస్తున్నారు. ఒడిశా, పాడేరు నుంచి జిల్లాకు ఎక్కువగా గంజాయి దిగుమతి అవుతోంది. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు రవాణా అవుతోంది. ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం , ఆమదాలవలస, పాతపట్నం తదితర ప్రాంతాల్లో గంజాయి కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నట్టు నమోదవుతున్న కేసులే సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

● పోలీసులకు కష్టతరమే..



ఒకవైపు గంజాయి, మరోవైపు విచ్చలవిడిగా దొరుకుతున్న మద్యంతో జిల్లాలో చాలా చోట్ల గొడవలు జరుగుతున్నాయి. ఘర్షణ పడిన వారు ఏ మైకంలో ఉన్నప్పటికీ గంజాయి మత్తు అని చెబితే ఇబ్బంది అని మద్యం ఖాతాలో వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏదేమైనా అటు మద్యం, ఇటు గంజాయితో ఇబ్బందికరంగా తయారైంది. తాజాగా పర్మిట్ రూమ్‌లు, అర్ధరాత్రి వరకు బార్లు తెరిచి ఉంచే అవకాశం ఇవ్వడంతో విచ్చలవిడితనం మరింత పెరిగిపోవడం ఖాయం. ప్రభుత్వమే అధికారికంగా అర్ధరాత్రి 12గంటల వరకు తాగే అవకాశం ఇవ్వడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో ఊహించలేని పరిస్థితి నెలకొంది. ఆ సమయం వరకు మందుబాబులపై నిఘా పెట్టాలి. లేదంటే మత్తులో ఏ దుశ్చర్యకు పాల్పడతారో చెప్పలేం. మొత్తానికి కూటమి ప్రభుత్వం తెచ్చిన మద్యం పాలసీ పోలీసులకు సవాల్‌గా మారిందనే చెప్పాలి.

ఒక్క లేఖ.. ▸ కక్కలేక.. మింగలేక!

- రచ్చగా మారిన అచ్చెన్న పేషీ
- మంత్రి ఓఎస్డీపై ఆరోపణలు
- ఆగ్రోస్ జీఎం ప్రభుత్వానికి రాసిన లేఖతో విస్తృత చర్చ



హాట్ టాపిక్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఒకే ఒక్క లేఖ.. మన జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేషీని వేలెత్తి చూపించింది. ఇప్పుడది జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఏపీ ఆగ్రోస్ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన రాజమోహన్ ప్రభుత్వానికి రాసిన లేఖతో అచ్చెన్నాయుడు పేషీ అవినీతికి కేంద్రంగా మారిందన్న ఆరోపణలకు తావిచ్చింది. ఇప్పుడంతా ఆయన దగ్గర పనిచేస్తున్న ఓఎస్డీపైనే చర్చ నడుస్తోంది. ఎవరా ఓఎస్డీ.. ఏంటా కథ.. అని ఆరా తీస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.

చెప్పిన మాట వినలేదని..

వ్యవసాయ యంత్ర పరికరాల తయారీదారులు, వ్యవసాయ శాఖ మంత్రి పేషీకి మధ్యవర్తిగా వ్యవహరించాలని ఓఎస్డీ కోరినట్టు ఏపీ ఆగ్రోస్ జనరల్ మేనేజర్ రాజమోహన్ ఏకంగా చీఫ్ సెక్రటరీతో పాటు ఏపీ ఆగ్రోస్ వైస్ చైర్మన్, ఎండీకి లేఖ రాశారు. ఓఎస్డీ చెప్పినట్టు వినలేదన్న అక్కసుతో తనను వేధించినట్టు.. ఆ ఒక్క కారణంతో తనను నెల్లూరుకు బదిలీ చేశారని లేఖలో ప్రస్తావించారు. సెలవుపై వెళ్లడం తప్ప మరో మార్గం కన్పించడం లేదని వెల్లడించారు. తన స్థానంలో కేసులు పెండింగ్‌లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ కేడర్ గల వారిని నియమించారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ లేఖ బయటకు రావడమే తరువాయి.. మంత్రి అచ్చెన్నాయుడిపైన, ఆయన పేషీ పైన, సదరు ఓఎస్డీపైన విస్తృత చర్చ జరుగుతోంది.

సూత్రధారిగా..

అచ్చెన్నాయుడు మంత్రి అయిన ప్రతీసారి ఓఎస్డీగా, వ్యక్తిగత సిబ్బందిగా ఉన్న ఒక 'నాయుడు' పాత్రపైనే ఎక్కువగా చర్చించుకుంటున్నారు. ఆయన చేసే ప్రతీ కార్యక్రమంలో వచ్చే ప్రయోజనాలు చివరికి ఎవరికి వెళ్తున్నాయో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదని.. కానీ అన్నింటికీ సూత్రధారి ఆ ఓఎస్డీయే అని మాట్లాడుకుంటున్నారు. జిల్లాలో ఆయన కోసం తెలిసిన ప్రతీ ఒక్కరూ పేషీలో ఏదో చేసే ఉంటాడని చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఆ ఓఎస్డీపై ఎల్లోమీడియాలో కూడా కథనాలు వచ్చాయని, ఆయన ఎంత బరితెగించకపోతే ఆ మీడియాలో తప్పని పరిస్థితుల్లో కథనాలు ఇచ్చి ఉంటారో అర్థం చేసుకోవచ్చని, అయినప్పటికీ వెనక్కి తగ్గడం లేదని విస్తృత చర్చ నడుస్తోంది. ఇక, అచ్చెన్నాయుడిపై ఆరోపణలు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందులో ఈఎస్ఐ స్కామ్ ప్రత్యేకమైనది.

● శిరస్త్రాణం..



● స్వేద జీవులకు..

గుబ్బగొడుగుగా వ్యవహరించే తాటాకుల ఛత్రం.. శ్రమజీవులకు శిరస్త్రాణం. ఎండైనా.. వానైనా.. నిరంతరం తలకు ధరించి స్వేదజీవి నిశ్చింతంగా పనిచేసుకునే సౌలభ్యం దీని సొంతం. దీనిని ధరించి మహిళలు రోజూ ఉపాధి పనులకు వెళ్లడం పరిపాటి.



● వాహనదారులకు..

నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించడం తప్పనిసరి. రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో తలకు బలమైన గాయాలు కాకుండా కొంత వరకు నిరోధించవచ్చు. పూర్తిగా పాడై ఉన్న దారుల్లో దీని ప్రయోజనం కచ్చితంగా ఉంటుంది. అటు ప్రమాదాల నివారణతో పాటు దుమ్ము.. ధూళి కళ్లలో పడకుండా కాపాడుకోవచ్చు.

పై రెండు చిత్రాలు బుధవారం కనిమెట్ట–రాపాక రూట్‌లో 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

- పొందూరు

అత్యవసర సేవలపై అవగాహన

శ్రీకాకుళం క్రైమ్ : మహిళలపై జరుగుతున్న నేరాలు– వారి భద్రతపై పోలీసు శాఖ నారీశక్తి కార్యక్రమం ద్వారా అందిస్తున్న అత్యవసర సేవలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి బుధవారం పేర్కొన్నారు. శక్తియాప్, డయల్ 112, ఉమెన్ హెల్ప్‌లైన్ 1091, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ సేఫ్టీ 181, సైబర్ టోల్‌ఫ్రీ 1930, ఈగల్ 1972 నంబర్ల గురించి జిల్లావ్యాప్తంగా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. డిజిటల్ అరెస్టుల పేరిట జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సౌకర్యాలు వద్దు.. ▸ సుందరీకరణే ముద్దు

రిమ్స్ లో వింత పరిస్థితి

- పడకల కొరత ఉన్నా పట్టించుకోని అధికారులు
- సుందరీకరణ పేరిట మొక్కలు ఏర్పాటు చేస్తున్న వైనం
- సరిపడా మంచాలు లేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు



రిమ్స్‌లో ఓ భవనం టెర్రస్‌పై నిర్లక్ష్యంగా పడేసిన మంచాలు

శ్రీకాకుళం : పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది జిల్లా కేంద్రంలోని రిమ్స్ సర్వజన ఆస్పత్రి పరిస్థితి. 930 పడకలతో పెద్దాసుపత్రిగా కొనసాగుతున్నా వాస్తవానికి మాత్రం ఇక్కడ ఉన్నవి 650 మాత్రమే. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ఈ పడకలు ఏ మూలకూ సరిపోవు. దీంతో పలువురు రోగులు గత్యంతరం లేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో నిర్వహణకు నోచుకోని వందలాది మంచాలు ఉన్నాయి. వీటిని భవనాల టెర్రస్‌పై, కొన్ని వార్డు గదుల్లో పడేసి వినియోగంలో లేకుండా చేసేశారు. ఇటు రిమ్స్ అధికారులు గానీ, అటు ఇంజినీరింగ్ అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. వీటిని జిల్లా అధికారులు, రాష్ట్ర అధికారుల అనుమతితో పాత సామాన్లుగా విక్రయిస్తే ఆ మొత్తంతో 300కు పైగా మంచాలను కొనుగోలు చేయవచ్చని వైద్యులే చెబుతుండటం గమనార్హం.

ఇదేం తీరు..

ఇంజినీరింగ్ అధికారులు సుమారు రూ.12 లక్షలను రిమ్స్ ప్రాంగణంలో సుందరీకరణ పేరిట మొక్కలు నాటడం వంటి పనులకు ఖర్చు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని వెచ్చిస్తే 300 పడకలతో పాటు నిరుపయోగంగా ఉన్న కొత్త హాస్టల్ భవనాలు వినియోగించుకునేందుకు అవసరమైన ఫర్నిచర్‌ను కొనుగోలు చేసుకోవచ్చు. అయితే మంత్రి, కలెక్టర్ సుందరీకరణ చేయాలని చెప్పినట్లు ఇంజినీరింగ్ అధికారులు పేర్కొనడం గమనార్హం. రోగులకు అవసరమైన వాటిని పక్కన పెట్టి సుందరీకరణ కోసం అంచనాల రూపొందించి వాటిని రిమ్స్ అధికారులతో ఆమోదింప చేయడం పట్ల ఆసుపత్రి వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. సౌకర్యాల కోసం కాకుండా సుందరీకరణ కోసం రిమ్స్ సూపరింటెండెంట్ ఏ విధంగా అంగీకరించారో అర్థం కావడం లేదని వైద్యులే చెబుతున్నారు.

> **మంత్రి ఆదేశాల మేరకే..**
>
> మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రిమ్స్ ఆవరణను సుందరీకరణగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అందుకోసమే పది లక్షల రూపాయలు వెచ్చిస్తున్నాం. ఈ అంచనాలకు అడ్మినిస్ట్రేటర్‌పాటు సూపరింటెండెంట్ ఆమోదించారు.
>
> – సత్య ప్రభాకర్, ఈఈ ఏపీహెచ్‌ఎంహెచ్ఐడీసీ

గదులూ కొరతే..

రిమ్స్‌లో చదువుతున్న ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులకు వసతి సమస్య వేధిస్తోంది. కొత్త భవనాలు నిర్మించినా ఫర్నిచర్ లేదన్న కారణంగా వాటిని రిమ్స్ అధికారులు రెండేళ్లుగా స్వాధీనం చేసుకోవడం లేదు. పలు వార్డు గదుల్లో పాత ఫర్నిచర్ పడేయడం వల్ల అవి కూడా నిరుపయోగంగా మారాయి. చాలా భవనాల్లో గదులను కొందరు ఇతర శాఖల అధికారులు, రిమ్స్‌లోని కొన్ని విభాగాల ఉద్యోగులు తమ ఆధీనంలో ఉంచుకోవడం కూడా గదుల కొరతకు కారణంగా నిలుస్తోంది. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, కుష్టు నివారణ అధికారితో పాటు శానిటేషన్ ,సెక్యూరిటీ ఇలా ఎంతోమంది గదులను తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఇదే సమయంలో హెచ్‌ఆర్ఏను మాత్రం జీతంతో పాటు తీసుకోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి పేద రోగులకు, వైద్య విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



● నాగావళి తీరంలో సూర్యకుసుమం

సూర్యాస్తమయాన నాగావళి నదీ తీరం అబ్బురపరిచింది. పరవళ్లు తొక్కుతున్న నాగావళి జలాలను తాకుతూ అరుణ కిరణాలు కనువిందు చేశాయి. కొద్దిరోజుల కిందటి వరకు అంతంతమాత్రంగానే ఉన్న నదీ ప్రవాహం ఇటీవల కురిసిన వర్షాలతో ఉద్ధృతంగా పెరగడంతో బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బ్రిడ్జి వద్ద ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది.

- శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

శ్రీకాకుళం రూరల్: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని వప్పంగిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ శాఖలపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో ఆపరేటివ్ లిమిటెడ్ నుంచి తయారైన నానో కాపర్, నానో యూరియా ప్లస్, నానో డీఏపీ, నానో జింక్ వంటి ఇఫ్కో నానో ఎరువులతో పాటు సీఐఎల్ కంపెనీ నానో యూరియా మార్కెట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఇవి గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తూ పంట నాణ్యత, ఉత్పత్తిని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, మండల వ్యవసాయాధికారి నవీన్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేశానికి మోదీనే బ్రాండ్

● ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్


పీవీఎన్ మాధవ్‌ను సత్కరిస్తున్న బీజేపీ జిల్లా నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతదేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనే పెద్ద బ్రాండ్ అని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఏపీ బీజేపీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి శ్రీకాకుళంలో బుధవారం పర్యటించిన మాధవ్‌కు జిల్లా నాయకులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఉమ్మడిగా పోటీ చేసేవిధంగానే చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ నాయకులంతా పోటీ చేసేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచపటంలో శ్రీకాకుళం జిల్లాకు ఒక ప్రత్యేక స్థానం, గుర్తింపు ఉందని కొనియాడారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో మెర్జ్ చేయాలని బీజేపీ రాష్ట్ర శాఖ తరుపున సూచించినట్లు పేర్కొన్నారు. దేశంలో స్టీల్ ప్లాంట్లు కాపాడిన ఘనత బీజేపీదేనని, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని, మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు త్వరితగతిన పూర్తిచేసేలా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, ముఖ్య నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి, అట్టాడ రవిబాబ్జి, బిర్లంగి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం గ్రామానికి చెందిన బాలికపై ఇప్పిలి సతీష్ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంతో జేఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పైడిభీమవరం హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న బాలిక మంగళవారం రాత్రి ఇంటి వద్ద ఉన్న సమయంలో, కనిమెట్ట గ్రామానికి చెందిన ఇప్పిలి సతీష్ అనే వ్యక్తి మద్యం తాగి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అతడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటనపై ఎస్‌ఐ ఎస్.చిరంజీవి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



రామారావు మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం గ్రామ పంచాయతీ చినహంస గ్రామానికి చెందిన లండ రామారావు అనే వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. ఒడిశాలోని రాధా సాగరంలో రామారావు గల్లంతైన విషయం తెలిసిందే. బుధవారం మృతదేహం ఒడ్డుకు కొట్టుకురావడంతో స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఒడిశా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృత్యువాతపడడంతో భార్య లక్ష్మి రోదనలు మిన్నంటాయి.

అక్రమంగా మూగజీవాలు తరలింపు

కంచిలి: ఒడిశా రాష్ట్ర పరిధి గొలంత్ర గ్రామం నుంచి విజయనగరం జిల్లా ఆలమంద సంతలో అమ్మేందుకు తరలిస్తున్న 12 గేదెలను కంచిలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం కంచిలి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వాహనంలో ఈ గేదెలను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వీటిని తరలిస్తున్న నలుగురుపైన కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు.

జరజాం ఏహెచ్‌ఏకు అవార్డు


అవార్డు అందుకుంటున్న తమ్మినేని అయ్యప్ప

ఎచ్చెర్ల: మండలంలోని జరజాం గ్రామ సచివాలయంలో పశుసంవర్ధక సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న తమ్మినేని అయ్యప్ప(సంతోష్‌కుమార్) జోన్–1 నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకున్నారు. బుధవారం విజయవాడలోని డైరెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఆ శాఖ రాష్ట్ర సంచాలకుడు డాక్టర్ డి.దామోదరనాయుడు ఈ అవార్డును అందించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి పలు కీలక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి, పాడి రైతులకు మేలు చేసినందుకు ఈ అవార్డును ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.

● కడుము గ్రామాన్ని వేధిస్తున్న తాగునీటి సమస్య
● వంశధార పక్కనే ఉన్నా గుక్కెడు నీటికి ఇబ్బంది
● చెలమ నీటితో అనారోగ్య సమస్యలు
● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


వంశధార నదిలో చెలమ నీరు తోడుతున్న గ్రామస్తులు

వంశధార చెంత.. తాగునీటికి చింత..!

కొత్తూరు:

తరాలు మారుతున్నా ఆ గ్రామ ప్రజల తలరాత మారడం లేదు. వంశధార నది నుంచి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి ఉద్దానం ప్రాంత గ్రామాలకు తాగునీటిని తరలిస్తున్న ఈరోజుల్లో, నది చెంతనే ఉన్నా గొంతెండుతున్న పరిస్థితి వారిది. పాలకుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గుక్కెడు నీటికోసం చెలమ వైపు చూస్తున్నారు మండలంలోని ఆంధ్రా – ఒడిశా సరిహద్దులో ఉన్నటువంటి కడుము గ్రామం ప్రజలు. ఈ గ్రామంలో సుమారు 2,500 మంది జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో ఎన్నో ఏళ్లుగా మహిళలు వంశధార నది వద్దకు వెళ్లి చెలమ నీటిని బిందెల్లో తోడుకొని ఇళ్లకు తీసుకొని వెళ్తుంటారు. నదికి వరదలు వచ్చినట్లయితే చెలమ నీటికి సైతం అవకాశం ఉండదు. అటువంటి సమయంలో గ్రామానికి రెండు కి.మీ దూరంలో ఉండే ఒడిశా రాష్ట్రంలోని కిడిగాం గ్రామం బోరు నుంచి తాగునీటిని తీసుకు రావాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గ్రామంలో ఉన్నటువంటి పంచాయతీ బోర్లు నుంచి వచ్చే నీరు తాగేందుకు ఉపయోగపడడం లేదని ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెలమ నీటినే తాగడం వలన అనారోగ్యాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. తమ గ్రామానికి సుజల ధార పథకంలో భాగంగా పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


బిందెలతో ఇంటికి కాలినడకన వెళ్తున్న మహిళలు

చర్యలు తీసుకుంటాం

కడుము గ్రామంలో ఇంటింటా కుళాయిలు వేసేందుకు ఉద్దానం ఫేజ్–2 పథకం నుంచి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరలో చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సాగర్,
ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ, కొత్తూరు మండలం

రెండు కి.మీ నడుస్తున్నాం



గ్రామంలో ఉన్న బోర్లు నుంచి వస్తున్న నీరు తాగేందుకు పనికి రావడం లేదు. దీంతో రానుపోను రెండు కి.మీ నడిచి నది వద్దకు నీటికోసం వస్తాము. వర్షాలు కురుస్తున్నా తాగునీటి కోసం నదికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

– కొల్లారి శ్రీదేవి, కడుము గ్రామం, కొత్తూరు మండలం

పట్టించుకోవడం లేదు



మా గ్రామానికి తాగునీటి కోసం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఊట నీరు కలుషితమైనప్పటికీ తప్పనిసరి పరిస్థితిలో ఆ నీరే తాగుతున్నాం. గ్రామంలో ఉన్న బోర్లు నుంచి వస్తున్న నీరు బాగులేకపోవడంతో ఊట నీరే మాకు దిక్కవుతోంది. అధికారులు స్పందించి తాగునీటి ఏర్పాట్లు చేయాలి.

– లంక పార్వతి,
కడుము గ్రామం, కొత్తూరు మండలం

వరదలు వస్తే ఒడిశా వెళ్లాలి



వర్షాకాలంలో వంశధార నదికి వరద వచ్చినట్లయితే ఊట నీరు ఉండదు. అప్పుడు మా గ్రామం నుంచి ఒడిశా రాష్ట్రం కిడిగాం గ్రామం సమీపంలో ఉన్న బోరు నుంచి తాగునీరు తీసుకొస్తాము. మేము తాగునీటి కోసం పడుతున్న కష్టాలు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మాకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– బూరాడ స్వాతి,
కడుము గ్రామం, కొత్తూరు మండలం

బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు

● టెక్కలి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్



టెక్కలి: కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల వాటాలో 50 శాతం మాత్రమే తీసుకుని మిగిలినది నగదు రూపంలో కూటమి ప్రభుత్వం లాగేసుకుందని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోటబొమ్మాళి మండలంలో మంత్రి అచ్చెన్నాయుడికి అనుకూలంగా ఉన్న బ్రోకర్ల వద్ద బ్లాక్ మార్కెట్‌లో ఎలా ఎరువులు దొరుకుతున్నాయో మంత్రి సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2018లో తిత్లీ తుఫాన్ సమయంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని అప్పటి మంత్రి హోదాలో అచ్చెన్నాయుడు హామీ ఇచ్చినా ఇంతవరకు సాయం అందలేదన్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక అప్పటి కమీషనర్ అరుణ్‌కుమార్ స్పందించి జిల్లాకు రూ.83 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారని, అందులో ఒక్క టెక్కలి నియోజకవర్గానికే రూ.39 కోట్లు ఇచ్చారని వివరించారు. దీనిపై కనీస అవగాహన లేక టీడీపీ నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా టెక్కలిని జిల్లా కేంద్రంగా మారుస్తానని, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని చెప్పి చివరకు రైతులే సొంత డబ్బులతో బీమా కట్టించుకునే పరిస్థితికి తీసుకువచ్చారని దుయ్యబట్టారు. కింజరాపు కుటుంబ పాలనలో టెక్కలిలో ఒక్క శాశ్వతమైన పథకం ఇచ్చారా అని తిలక్ ప్రశ్నించారు. అచ్చెన్నాయుడికి సత్తా ఉంటే ఆఫ్‌షోర్, విత్తనోత్పత్తి కేంద్రాన్ని పూర్తి చేయాలని, రైతులకు రెండో విడతగా పూర్తి స్థాయిలో ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంత్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు హెచ్.వెంకటేశ్వరరావు, ఎస్.హేమసుందర్ రాజు, టి.ఫాల్గుణరావు, బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి జి.గురునాథ్ యాదవ్, నాయకులు కె.అజయ్‌కుమార్, కె.జీవన్, పి.వైకుంఠరావు, డి.కూర్మారావు, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన మహిళ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు, పక్కనే ఎస్‌ఐ రమేష్ బాబు

మెళియాపుట్టి: ఈనెల 14వ తేదీన పట్టపగలే ఒక మహిళ చోరీకి ప్రయత్నించడమే కాకుండా.. మరో మహిళపై దాడిచేసి పారిపోయిన ఘటన మండలంలోని పట్టుపురం గ్రామంలో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అయితే మంగళవారం సాయంత్రం దాడికి పాల్పడిన మహిళను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పాతపట్నం సీఐ వి.రామారావు, ఎస్‌ఐ పి.రమేష్ బాబు మీడియాకు వివరాలు బుధవారం వెల్లడించారు. మెళియాపుట్టి మండలంలోని వసుంధర గ్రామానికి చెందిన మనుజ మల్లిక్ అనే 41 ఏళ్ల మహిళ పట్టుపురం గ్రామానికి చెందిన అంబల లచ్చయ్య ఇంట్లో ఈనెల 14వ తేదీన చొరబడింది. అదే సమయంలో లచ్చయ్య భార్య అంబలి కాంచన మెళియాపుట్టి గ్రామంలో ఉన్న సాయిబాబా ఆలయంలో సేవకు వెళ్లి కార్యక్రమం ముగించుకుని ఇంటికి వచ్చింది. ఆ సమయంలో ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికే, తలుపు చాటున గుర్తు తెలియని మహిళ (మనుజ మల్లిక్) కాంచన తలపై బలంగా కర్రచెక్కతో కొట్టి పారిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దీనిలో భాగంగా మనుజ మల్లిక్ స్కూటీ, ఆమె వేసుకున్న బుర్ఖా, ఇతర ఆనవాళ్లు సీసీ కెమెరాలో గుర్తించారు. మంగళవారం వసుంధర చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో సీసీటీవీ ఫుటేజీలో గుర్తించిన ద్విచక్ర వాహనం గమనించి ఆమెను పట్టుకున్నారు. దొంగతనానికి వచ్చి, అంతలోనే ఇంటి యజమాని రావడంతో దొరికిపోతానేమోనన్న భయంతో దాడికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

పక్కా ప్లాన్‌తోనే..

ఒడిశాలోని ఖైటడ గ్రామంలో బాధితురాలు, ముద్దాయి మనుజ పక్కపక్క ఇళ్లల్లో కొన్నేళ్లు కలిసి ఉండేవారు అదే క్రమంలో పరిచయం ఏర్పడింది. పలుమార్లు పట్టుపురం వచ్చి అంతా గమనించి దొంగతనానికి పాల్పడింది. మనుజ మల్లిక్ ప్రస్తుతం పర్లాకిమిడిలో బ్యూటీపార్లర్ నడుపుతుంది. అక్కడి ఆర్టీవో కార్యాలయం అధికారులతో చనువు పెంచుకుని పలువురికి లైసెన్సులు చేయిస్తూ ఉంటుంది. ఆమె విలాసాలకు అలవాటుపడి నేరాలకు పాల్పడుతుందని, ఆమె ఉన్న ఏరియాలోనే దొంగతనాలు జరుగుతున్నాయని, వాటి వెనుక ఈమె హస్తం ఉందని ఒడిశా పోలీసులు సైతం అనుమానిస్తున్నట్లు సమాచారం. వారు కూడా ఈమె కదలికలపై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.

కూనకు మతి భ్రమించింది

● ఫ్రస్టేషన్‌లో ఏదేదో మాట్లాడుతున్నారు
● దళిత మహిళను వేధించడం నిజమా.. కాదా..!
● వైఎస్సార్ సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ ధ్వజం


ఎమ్మెల్యే కూన ఫొటోలను మీడియాకు చూపిస్తున్న చింతాడ రవికుమార్ తదితరులు

ఆమదాలవలస: ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మతి భ్రమించిందని, ఫ్రస్టేషన్‌లో ఏదేదో మాట్లాడుతున్నారని ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూన తాను హరిశ్చంద్రుడు, శ్రీరామచంద్రుడు అంటూ దేవుళ్లతో పోల్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ తనను శారీరకంగా, మానసికంగా వేధించారని ఇద్దరు వ్యక్తులను పంపించి తనకు లొంగిపోవాలని ఆదేశించారని లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య మీడియా ముఖంగా తెలియజేశారన్నారు. ఆమె ఆరోపణలకు ఎమ్మెల్యే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సింది పోయి వైఎస్సార్ సీపీపై లేనిపోని ప్రేలాపనలు చేయడం సరికాదన్నారు. ఒంటరి దళిత మహిళ, ఉన్నత విద్యావంతురాలిని వేధించడం నిజమా.. కాదా అని ప్రశ్నించారు. ఆమెపై వేధింపులకు సాక్ష్యాలు అడగటం సరికాదని, ఎవరైనా మహిళలను వేధిస్తుంటే వీడియోలు, ఫొటోలు తీసి సాక్ష్యాలుగా ఉంచుకుంటారా అని ప్రశ్నించారు. మహిళా ఉద్యోగులతో సాయంత్రం ఐదు గంటల తర్వాత అర్ధరాత్రి వరకు సమీక్షా సమావేశాలు పెట్టమని ఏ ప్రివిలేజ్ కమిటీ చెప్పిందో ఎమ్మెల్యే తెలియజేయాలని డిమాండ్‌చేశారు. సౌమ్యను నిజంగా వేధించకపోతే ఎమ్మెల్యే ఆఫీసులో ఆ రోజు జరిగిన ఘటనల సీసీటీవీ ఫుటేజీ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. నిబద్ధతగల నాయకుడైతే జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సీఎం చంద్రబాబును కోరాలన్నారు. తనకు డిగ్రీలు ఇప్పించానని కూన అసత్య వ్యాఖ్యలు చేయడంపై క్రిమినల్ కేసు పెట్టి సివిల్ సూట్ వేస్తానని రవికుమార్ హెచ్చరించారు. కూన రవికుమార్ ఇంటర్‌లో 12 సబ్జెక్టులు ఫెయిలయ్యారని, తర్వాత ఇంజినీరింగ్‌లో కాపీ కొట్టి పాస్ అయ్యారని తెలిపారు. ఇసుక, అక్రమ భూదందా, మహిళలను వేధించడం వంటి అకృత్యాలకు పూర్తి ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. పలువురు మహిళలతో ప్రత్యేక టూర్లకు వెళ్లడం కూన రవికుమార్ హాబీ అని ఆరోపించారు. ఒంటిమిట్ట ఆలయానికి ఓ మహిళతో వెళ్లి ఆమెను కుటుంబ సభ్యురాలుగా చెప్పి కూర్చొని పూజలు చేయించడం గుర్తు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వేరే మహిళలతో ఎలా అసభ్యకరంగా వ్యవహరిస్తుంటారో సంబంధిత ఫొటోలను చూపించారు. అయితే మహిళల పట్ల ఉన్న గౌరవంతో వారి ముఖాలను చూపించడం లేదన్నారు. ఇప్పటికైనా మహిళలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, ఆమదాలవలస మున్సిపల్ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, బూర్జ మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, పొందూరు మండల పార్టీ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, పార్టీ ముఖ్య నాయకులు బొడ్డేపల్లి రాజు, కూన రామకృష్ణ, మామిడి రమేష్, నున్నగాపుల చిన్నారావు, కుప్పిలి సత్యనారాయణ, పులువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల సమస్య పక్కదారి పడుతోంది

● డీటీఎఫ్ నాయకుడు పేడాడ కృష్ణారావు

శ్రీకాకుళం: జిల్లాలో ఇటీవల జరిగిన ముగ్గురు కేజీబీవీ ప్రిన్సిపాల్స్ బదిలీల సమస్య పక్కదారి పడుతోందని, రాజకీయ సమస్యగా మారుస్తున్నారని డీటీఎఫ్ నాయకుడు పేడాడ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోలుగు కేజీబీవీ నుంచి కంచిలికి బదిలీ అయిన ప్రిన్సిపాల్ సౌమ్య, ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ నాయకుల మధ్య జరుగుతున్న ఆరోపణలతో అసలు విషయం మరుగున పడుతోందన్నారు. జిల్లా అధికారులు, అధికార పార్టీ నాయకులు చెబుతున్నట్లుగా లోలుగు కేజీబీవీ నుంచి కంచిలికి బదిలీ అయిన సౌమ్య అక్రమాలకు పాల్పడితే సుదూర ప్రాంతానికి బదిలీ చేయడం మంచిదేనన్నారు. అయితే కంచిలి కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను జిల్లా కేంద్రం సమీపంలోని కేజీబీవీకి ఎందుకు బదిలీ చేయాల్సి వచ్చిందో అధికారులు, అధికార పార్టీ పెద్దలు చెప్పకపోవడం విచారకరమన్నారు. అలాగే గారలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్‌ను పొందూరు ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించారు. సౌమ్య నిజంగానే అవినీతి చేసి ఉంటే, విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టి ఇద్దరిని మాత్రమే బదిలీ చేస్తే సమంజసంగా ఉండేదని, ముగ్గురిని ఎందుకు బదిలీ చేశారో కారణాలను ఎస్ఎస్ఏ అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం బదిలీలకు గల కారణాలను వెల్లడించి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

సత్తాచాటిన ప్రజ్ఞామణి



సోంపేట: నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) నీట్ పీజీ ఫలితాల్లో సోంపేటకు చెందిన విద్యార్థిని గేదెల ప్రజ్ఞామణి జాతీయ స్థాయిలో 1,039వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. ఈమె ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుంది. పీజీ ఫలితాల్లో సత్తా చాటడంతో తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు.

పొగురు తెచ్చిన చేటు..!

● ముంచెత్తిన వరద
● నీటిలోనే పంట పొలాలు


నీట మునిగిన బూర్జపాడు పంట పొలాలు

ఇచ్ఛాపురం రూరల్: అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు బూర్జపాడు పంట పొలాలు నీట మునిగిపోయాయి. స్థానిక డొంకూరు ఉప్పుటేరుకు ఆనుకొని ఉన్న పంట పొలాల రైతులకు పొగురు వలన తీవ్ర నష్టం కలిగింది. కురిసిన వర్షాలకు వరద నీరు ఉప్పుటేరు గుండా సముద్రంలో కలవాల్సి ఉండగా.. సముద్రంలో ఉప్పుటేరు కలిసే చోట ఇసుక మేట వేయడంతో వరద నీరు పంట పొలాల్లోకి చొచ్చుకుపోయింది. దీంతో సుమారు 50 ఎకరాల వరకు పంట నీట మునిగిపోయింది. సోమ, మంగళవారం రోజున నాటిన వరినాట్లు వరద ఉధృతికి నీటిపైకి తేలిపోవడంతో రైతులు తలలు పట్టుకున్నారు. ప్రస్తుతం వరినారు ఎక్కడా దొరకని పరిస్థితి ఉండగా.. ఇటువంటి పరిస్థితుల్లో మరల నాట్లు ఎలా వేసేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి డొంకూరు సముద్రం – ఉప్పుటేరు మధ్య ఇసుక మేటలు(పొగురు) తొలగిస్తే పంటలను రక్షించుకోవచ్చని, లేకుంటే వందల ఎకరాలకు నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు.

హెల్త్ కేర్ కోర్సులకు దరఖాస్తులు

శ్రీకాకుళం రూరల్: ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ వారు డిప్లమో ఎలైడ్ హెల్త్ కేర్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్‌లో ఏ గ్రూప్‌లో పాస్ అయిన విద్యార్థులైనా అర్హులేనని పేర్కొన్నారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. తమ కళాశాలల్లో కన్వీనర్ మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముంచేసిన వర్షం.. మేలుకోకుంటే నష్టం

● పంటల్లో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి
● వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు


నీట మునిగిన పంట పొలాలు


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ పొలాల్లో నీరు కనిపిస్తోంది. కాలువల ద్వారా పొలాల్లోకి సాగునీరు చేరింది. అయితే వంశధార, నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో ఇప్పటికే వెద పద్ధతిలో వరి సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంట నీట మునిగితే ఎదుగుదలకు ఆటంకం కలిగే అవకాశం ఉందని ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు తెలిపారు. ఈ తరుణంలో వరితోపాటు వివిధ పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు వరి పంట 1.30 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అలాగే మొక్కజొన్న 9,000 హెక్టార్లు, పత్తి పంట 850 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఈ పంటల్లో జాగ్రత్తలు పాటిస్తే నష్ట నివారణ చర్యలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.

వరి పంటలో...

జూన్, జూలై నెలల్లో ముందుగా వెదజల్లిన వరిపంట పిలక దశకు చేరుకుంది. ఇంద్ర(ఎంటీయూ 1061), అమర ఎంటీయూ (1064) వంటి రకాలు కొంతవరకు ముంపును/అధిక నీటిని తట్టుకోగలవు.

- పొలాల నుంచి నీరు బయటకు పోయేలా మార్గాలు ఏర్పాటు చేయాలి. పంట పాక్షికంగా దెబ్బ తిన్నట్లయితే పంటలో ఒత్తుగా ఉన్న పిలకలను తీసి పలుచగా ఉన్నచోట నాటుకోవాలి. అలాగే పంట ఎదుగుదలకు ఎకరాకు 20 – 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలి. లేదా నానో యూరియా ఎకరానికి అరలీటర్ చొప్పున పిచికారీ చేసుకోవాలి.
- పంటమీద తెగుళ్లు రాకుండా ఉండేందుకు కార్బండిజం ఒక గ్రాము లేదా మాంకోజెబ్ రెండు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- నాట్లు వేసే రైతులకు ఈ వర్షాలు అనుకూలం కాబట్టి 30 నుంచి 35 రోజుల ఆరోగ్యవంతమైన నారు నాటుకోవాలి. నారు ముదిరితే దగ్గర దగ్గరగా కుదురుకు ఎక్కువ పిలకలు ఉండేటట్లు చూసుకోవాలి.
- నాట్లువేసిన వారం రోజులు లోపు తప్పనిసరిగా 50 కిలోల డీఏపీతో పాటు పది కిలోల పొటాష్ ఎరువును వేసుకోవాలి.
- అలాగే నాట్లు వేసిన వారం రోజులకు ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీ మీటర్లు చొప్పున కాలిబాటలు తీయాలి.

మొక్కజొన్న పంటలో...

జూన్ మాసంలో విత్తుకున్న మొక్కజొన్న పైరు పూత దశలో, జూలై నెలలో విత్తుకున్న పైరు మోకాలు ఎత్తు దశలో ఉంటుంది. – పూత దశలో ఉన్న పైరుకు ఎకరాకు 50 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలి.

- 25 నుంచి 30 రోజుల వయసున్న పైరులో అంతర కృషి జరిపి, ఎకరాకు ఒక బస్తా యూరియాను పైపాటుగా వేసుకొని, మట్టిని మొక్కల వేర్లకు ఎగదోయాలి.
- ఎక్కువ వర్షపాతం నమోదైనప్పుడు లేత పైరు అధిక తేమను తట్టుకోలేదు. ఈ పరిస్థితిని నివారించుటకు పొలం నుంచి వర్షపు నీటిని మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీయాలి.
- ఎకరాకి 25 కిలోల యూరియా, పది కిలోల పొటాష్ ఎరువులను అదనంగా వేయాలి.

పత్తి పంటలో...

ప్రత్తి పంట అధిక తేమను తట్టుకోలేదు. ఆకులు మొదట గులాబీ రంగుకు మారి, తర్వాత పూర్తిగా ఎర్రబడి, ఎండిపోయి రాలిపోతాయి.

- పొలంలో కాలువలు తీసుకొని నీటిని బయటకు పంపించాలి.
- నెలరోజులు దాటిన పంట అధిక వర్షాలకు గురైతే, పంట ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోలు యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను అదనంగా వేయాలి.
- లేదా లీటరు నీటికి 10 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ మరియు 10 గ్రాముల యూరియా/డీఏపీ కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- వేరుకుళ్లు తెగులు ఆశించకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లను తడపాలి